క్లుప్తంగా

పెండేకంటి వెంకటసుబ్బయ్య వర్ధంతి

బనగానపల్లె రూరల్ : మండలంలోని యాగంటిపల్లె కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే)లో దివంగత కేంద్ర మంత్రి పెండేకంటి వెంకటసుబ్బయ్య 30వ వర్ధంతి కార్యక్రమం కేవీకే సీనియర్ ప్రధాన శాస్త్రవేత్త ధనలక్ష్మీ ఆధ్వర్యంలో గురువారం జరిగింది. పెండేకంటి చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ధనలక్ష్మీ మాట్లాడుతూ దివంగత కేంద్ర మంత్రిగా ఉన్న సమయంలో ఈ ప్రాంతాల్లో పాలిటెక్నినిక్, ఐటీఐ కళాశాలలో పాటు రైతులకు ఎంతో అవసరమైన కృషి విజ్ఞాన కేంద్రాన్ని చేశారన్నారు. కర్ణాటక, బీహార్ రాష్ట్రాల గవర్నర్‌గా పెండేకంటి చేసిన సేవలను గుర్తు చేశారు. కార్యక్రమంలో ఏఓ సురేష్‌కుమార్, కేవీకే శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

నేడు శింగనపల్లెలో జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంప్

అవుకు: మండల పరిధిలోని శింగనపల్లె గ్రామంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. గ్రామంలోని చర్చీ సమీపంలో ఉదయం 7గంటలకు ప్రారంభమయ్యే హెల్త్ క్యాంప్‌లో నలుగురు వైద్యనిపుణులు ప్రజలకు ఆరోగ్య పరీక్షలు చేస్తారన్నారు. పేదల సౌకర్యార్థం నిర్వహించే హెల్త్ క్యాంప్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఎంప్లాయీస్ యూనియన్ నూతన కార్యవర్గం ఎన్నిక

డోన్: డోన్ పురపాలక సంఘం ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం ఆవరణలో ఉద్యోగులు సమావేశమై అధ్యక్షునిగా రంగన్న, ప్రధాన కార్యదర్శి మధుబాబు, లక్ష్మీనారాయణ, సహాయ కార్యదర్శి శ్రీనివాసులు, కోశాధికారిణిగా పద్మ, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా రాజు, రవీంద్ర, రాధమ్మ, అనిరుధ్, ఆదినారాయణ, ఎల్లమ్మ, మోహన్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం రంగన్నను సభ్యులు ఘనంగా సన్మానించారు.

సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడులు

బేతంచెర్ల: పంటల సాగులో సస్యరక్షణ చర్యలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని డాట్ సెంటర్ శాస్త్ర వేత్త బాలజీ నాయక్, డీఆర్‌సీ సెంటర్ ఏడీఏ సరళమ్మ, డీఆర్‌సీ ఏఓ ప్రభావతమ్మ అన్నారు. గురువారం మండల పరిధిలోని రంగాపురం గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలో రైతులతో ముఖా ముఖీ నిర్వహించారు. ఈసందర్భంగా రైతులకు ప్రస్తుతం శనగ సాగు లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రొద్దు తిరుగుడు సాగు గురించి వివరించారు. కార్యక్రమంలో ఏఈఓలు మధు, బెన్నీ రాజు, అగ్రికల్చర్ అసిస్టెంట్స్ భారతి, యశోద, లక్ష్మి పాల్గొన్నారు.

సాంకేతిక విద్యతో ఉపాధి అవకాశాలు



శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న దృశ్యం

డోన్: ప్రస్తుత పరిస్థితుల్లో సాంకేతిక విద్యను అభ్యసించిన యువతకు మంచి ఉపాధి అవకాశాలు ఉన్నాయని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ అన్నారు. స్థానిక ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థలో వివిధ ట్రేడులలో శిక్షణ పొందిన విద్యార్థులకు గురువారం ఆయన కాన్వకేషన్ సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశ్రామికంగా రాష్ట్రం అభివృద్ధి వైపు పరుగులు తీస్తున్న దశలో సాంకేతిక శిక్షణలో నిపుణులైన వారికి మంచి అవకాశాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఐటీఐ ప్రిన్సిపాల్ ప్రసాద్‌రెడ్డి, పీఓ సూ ర్యశేఖర్‌రెడ్డి,పీఓ ధర్మాకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు పట్టుదలతో చదవాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న జిల్లా బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ లక్ష్మీదేవి

బనగానపల్లె రూరల్ : విద్యార్థులు పట్టుదల క్రమ శిక్షణతో ఉన్నత చదువులు అభ్యసించాలని జిల్లా బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ లక్ష్మీదేవి సూచించారు. గురువారం సాయంత్రం బనగానపల్లె పట్టణంలోని రవ్వలకొండపై ఉన్న బీసీ బాలుర వసతి గృహాన్ని ఆమె తనిఖీ చేశారు. విద్యార్థుల సంఖ్య, హాజరు, రోజు అందిస్తున్న మెనూ వివరాలను వార్డెన్ నాగేంద్రను అడిగి తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేద మధ్య తరగతి పిల్లల ఉన్నత చదువులు అభ్యసించాలనే ఉద్దేశ్యంతో ఆర్థికంగా ఇబ్బంది పడకూడదనే బావనతో వసతి గృహాలను ఏర్పాటు చేసి, నాణ్యమైన పౌష్టికాహారం అందించడం జరుగుతుందన్నారు.

'కుస్తీ' పట్టుదల జాస్తీ!

- సత్తా చాటుతున్న ఆకుమల్ల కుర్రోడు
- రాష్ట్రస్థాయిలో బంగారు, వెండి పతకాలు కైవసం
- జాతీయ స్థాయిలోనూ సిల్వర్ పతకం సొంతం
- అంతర్జాతీయ పోటీలకు ఎంపిక
- వెంటాడుతోన్న ఆర్థిక కష్టాలు

సంజామల: ప్రాచీన క్రీడ కుస్తీ. ఇందులో రాణించాలంటే ఎంతో ధైర్యసాహసాలు ఉండాలి. కుస్తీలో కనీసం గుర్తింపు పొందాలన్నా సవాలే. కుస్తీకి సంబంధించి వివధ రకాల క్రీడలు ఉన్నాయి. పట్టుదల జాస్తి ఉంటే తప్పా ఈ క్రీడల్లో రాణించలేరు. ఎంతో ఓపిక.. అంతకుమించి చురుకుతనం అవసరం. ఏ మాత్రం రెప్పవాల్చిన ప్రత్యర్థి చేతిలో చిత్తు కావాల్సిందే. ఉడుం పట్టులో చిక్కుకోక తప్పదు. ప్రత్యర్థి ఊహకు మించి అప్పటికప్పుడు క్షణాల్లో ఎత్తులు వేయాల్సిన క్రీడ. అలాంటి ప్రాచీన క్రీడ కుస్తీలో(గ్రాప్లింగ్) సంజామల మండల పరిధిలోని ఆకుమల్ల గ్రామం కుర్రోడు అబ్దుల్ రసూల్ సత్తా చాటుతున్నాడు. ఏకంగా అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. వ్యవసాయ కూలీలైన మహబుబ్ పీరా, మహబుబ్‌బీ దంపతుల కుమారుడు అబ్దుల్ రసూల్ చిన్నప్పటి నుంచి చదువుతోపాటు క్రీడలంటే ఎక్కువ మక్కువ. పదవ తరగతి వరకు ఆకుమల్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యనభ్యశించిన అబ్దుల్ రసూల్ ఇంటర్ నంద్యాల ఓ ప్రైవేట్ కళాశాలలో పూర్తి చేశాడు. ఓపెన్ కళాశాలలో డిగ్రీ చదువుకుంటూ నంద్యాలలోనే ఉద్యోగ సాధించేందుకు ఓ ప్రైవేట్ కేంద్రంలో శిక్షణ తీసుకుంటున్నాడు. అదేవిధంగా కుస్తీలోనూ శిక్షణ తీసుకుంటూ శ్రమిస్తున్నాడు కూడా.

ఆర్థిక సమస్యలతోనూ 'కుస్తీ'

కుస్తీలో(గ్రాప్లింగ్) జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన అబ్దుల్ రసూల్ ఆర్థిక సమస్యలతోనూ కుస్తీ పడుతూనే ఉన్నాడు. 2021 సంవత్సరంలో ఢిల్లీలో జరిగిన జాతీయ స్థాయిలో రాణించిన ఈ కుర్రాడు అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు కూడా. అయితే ఆర్థిక పరిస్థితులు వెనక్కు నెట్టాయి. దీంతో అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనలేకపోయాడు. అయినా వెనకడగు వేయలేదు.2023 అక్టోబర్‌లో హర్యానా రాష్ట్రం రోహ్‌తక్‌లో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో సిల్వర్ పథకం సాధించాడు. దీంతో రష్యాలో జరిగే అంతర్జాతీయ స్థాయికి ఎంపికయ్యాడు. ఇక రష్యాలో సత్తా చాటడమే తరువాయి. అంతర్జాతీయ పోటీలకు ఎంపికైన అబ్దుల్ రసూల్‌కు దాతలు ఆర్థిక ప్రోత్సాహం అందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

వరించిన పతకాలు....

- 2021లో కర్నూలులో జరిగిన గ్రాప్లింగ్ జిల్లా స్థాయి ఎంపిక పోటీల్లో ప్రతిభచాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు.
- 2021లో అనంతపూరం జిల్లా జరిగిన గ్రాప్లింగ్ రాష్ట్ర స్థాయి పోటీల్లో ద్వితీయ స్థానంలో నిలువడంతో రజక పతకం సొంతమైంది.
- 2021లో ఢిల్లీలో జరిగిన జాతీయ స్థాయిలో పోటీల్లోనూ రజిత పథకం సాధించి అంతర్జాతీయస్థాయి పోటీకి ఎంపికయ్యాడు. ఆర్థిక పరిస్థితుల మూలంగా పాల్గొనలేకపోయాడు.
- 2022లో నంద్యాలలో జరిగిన జిల్లా స్థాయి పోటీలో బంగారు పతకం సాధించి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాడు.
- 2023లో నంద్యాలలో జరిగిన జిల్లా స్థాయి పోటీలో బంగారు పథకం సాధించి రాష్ట్ర స్థాయికి ఎంపిక.
- 2023లో సెప్టెంబర్ నెలలో విశాఖ పట్నంలో జరిగిన రాష్ట్రస్థాయిలో రెండు క్యాటగిరిల్లోనూ బంగారు, వెండి పతకాలు సాధించి జాతీయ స్థాయికి ఎంపికయ్యాడు.
- 2023 అక్టోబర్‌లో హర్యాన రాష్ట్రం రోహ్‌తక్‌లో జరిగిన జాతీయ స్థాయిలో సిల్వర్ పథకం సాధించి రష్యాలో జరిగే అంతర్జాతీయ స్థాయికి ఎంపికయ్యాడు.



హర్యానా రాష్ట్రం రోహ్‌తక్‌లో జరుగుతున్న ఫైనల్ రౌండ్‌లో తలపడుతున్న అబ్దుల్(ఫైల్)



హర్యానా రాష్ట్రం రోహ్‌తక్‌లో సిల్వర్ మెడల్ అందుకుంటున్న అబ్దుల్(ఫైల్)

అంతర్జాతీయ స్థాయిలో రాణించడమే లక్ష్యం



కుస్తీ(గ్రాప్లింగ్) అంటే ప్రాణం. అంతర్జాతీయ స్థాయిలో రాణిచాన్నదే లక్ష్యం. డిగ్రీ చదువుకుంటూనే కుస్తీ పోటీలకు శిక్షణ తీసుకున్నా. రోజు దాదాపు ఆరు గంటలు శిక్షణ తీసుకునేవాడిని. ఈ శ్రమ ఫలితంగా జాతీయ స్థాయి పోటీల్లోనూ రాణించగలిగా. గతంలో అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనే అవకాశం వచ్చినా ఆర్థిక పరిస్థితులు సహకరించలేదు. ప్రస్తుతం రష్యాలో నిర్వహించనున్న అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యా. ఈ పోటీల్లో రాణించేందుకు శ్రమిస్తున్నా.

– అబ్దుల్ రసూల్

సంపూర్ణ ఆరోగ్యానికి వ్యాయామం తప్పనిసరి

డోన్ టౌన్ : సంపూర్ణ ఆరోగ్యానికి వ్యాయామం తప్పనిసరి అని, ప్రతిఒక్కరూ తన దిన చర్యల్లో కొంత సమయం కేటాయించుకోవాలని డాక్టర్ కుసుమకుమారి, ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు షాలినీ అన్నారు. పట్టణ సమీపంలోని గురుకుల బాలికల పాఠశాల్లో విద్యార్థినులకు ఇన్నర్‌వీల్ క్లబ్ ఆధ్వర్యంలో ఇస్తున్న యోగా శిక్షణా తరగతులు గురువారం ముగిశాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతో పాటు మానసిక ప్రశాంతత ఎంతో అవసరం అన్నారు.ఏకాగ్రత కోసం ధ్యానం,యోగాసనాలు ఎంతో ముఖ్యం అన్నారు. అనంతరం యోగాసనాల్లో ఆసక్తి కనభరచిన విద్యార్థినీలకు ప్రముఖ న్యాయవాది నాగభూషణం రెడ్డి ఆర్థిక సహకారంతో పోత్సాహక బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గీత, ఇన్నర్ వీల్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షురాలు రాజా సుజాత, సభ్యులు ముడిమాల శైలజ, శారద, సూర్యకుమారి, సరళాదేవి, యోగా టీచర్ సోనూ, ఉపాధ్యారాలు భాగ్యలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

గుర్తింపు కార్డుల దరఖాస్తుల గడువు పొడిగించాలి

డోన్ టౌన్ : కళాకారులను గుర్తించేందుకు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేస్తున్న ఐడీ కార్డుల కోసం దరఖాస్తు సమర్పించే గడువు పెంచాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఏఈ నాగరాజు ప్రభుత్వాన్ని కోరారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 7వ తేదీతో గడువు ముగిసిందని, ఇంకా చాలా మంది కళాకారులకు తెలియక దరఖాస్తు చేసుకోలేదన్నారు. అధికారులు స్పందించి గడువు పొడిగించాలని కోరారు.

క్రైం కార్నర్

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి మృతి

అవుకు: ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మండల పరిధిలోని సుంకేసుల గ్రామానికి చెందిన మితాయిగారి మస్తాన్ వలి(35) గురువారం మృతి చెందాడు. పోలీసుల వివరాలు ఇలా ఉన్నాయి. మస్తాన్ వలి కొంతకాలంగా అనారోగ్యానికి గురై మద్యానికి భానిసయ్యాడు. బుధవారం గ్రామ సమీపాన పొలంలో క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు వెంటనే ఆకుమళ్ల ఆసుపత్రికి తీసుకెళ్లి, అక్కడి నుంచి బనగానపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. భార్య మితాయిగారి ఉశేన్ బీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు. మృతునికి ఇద్దరు కుమారులు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

బేతంచెర్ల: మండల పరిధిలోని కొలుములపల్లె గ్రామ సచివాలయం సమీపాన ప్రమాదవశాత్తు ట్రాక్టర్, ద్విచక్రవాహనం ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై ఉన్న ముద్దవరం గ్రామానికి చెందిన బాలస్వామికి చెయ్యి విరిగి తీవ్రగాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ లింగమయ్య తెలిపారు.

అదనపు వరకట్నం కోసం వేధింపులు

డోన్ రూరల్ : అదనపు వరకట్నం కోసం వేధిస్తున్నారని మండల పరిధిలోని వెంకటాపురం గ్రామానికి చెందిన మల్లేశ్వరి గురువారం రూరల్ పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించింది. పోలీసుల వివరాల మేరకు వెంకటాపురం గ్రామానికి చెందిన మల్లేశ్వరి, సురేష్‌కు తొమ్మిదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి కుమారుడు ఉన్నాడు. అయితే కొద్ది రోజులుగా అదనంగా కట్నం తేవాలని భర్త సురేష్, మామ మద్దిలేటి, అత్త రామలక్ష్మి వేధిస్తున్నారని బాధితురాలు ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

వ్యక్తిపై దాడి

బేతంచెర్ల: మండల పరిధిలోని యంబాయి గ్రామంలో ట్రాక్టర్ ఫైనాన్స్ విషయంలో బోయ రవికుమార్‌పై అదే గ్రామానికి సిద్దయ్య గొడవ పెట్టుకొని దాడి చేశాడు. బాధితుడు రవి కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ సజ్జద్ అలీ తెలిపారు.

చీటింగ్ కేసు నమోదు

బనగానపల్లె రూరల్ : విజయవాడకు చెందిన వడ్ల వ్యాపారి లక్ష్మీకిరణ్మయి ట్రేడర్స్ యజమాని లక్ష్మీకిరణ్మయి ఆమె భర్త సుబ్రహ్మణ్యం గుప్తపై నందివర్గం పోలీసు స్టేషన్‌లో చీటింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రామాంజనేయరెడ్డి గురువారం తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల మేరకు స్టేషన్ పరిధిలో బీరవోలు గ్రామానికి చెందిన పార్సప్ప సుబ్బరాయుడు, అలమూరుకు చెందిన మల్లు జయప్రకాష్‌రెడ్డి నిందితులకు 7-12-2022 నుంచి 23-12-2022 వరకు బీరవోలు గ్రామానికి చెందిన రైతుల నుంచి సుమారు 11 లారీల వరి ధాన్యాన్ని విక్రయించారు. మొత్తం రూ.68,09,000 ఇవ్వాల్సి ఉండగా విడతల వారీగా అందులో రూ.23,30,000 మాత్రం చెల్లించారు. మిగిలిన మొత్తాన్ని చెల్లించాలని విజయవాడకు వెళ్లీ అడుగుతున్నా స్పందన లేదని బాధితులు ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ఈ మేరకు లక్ష్మీకిరణ్మయి, ఆమె భర్త సుబ్రహ్మణ్యంగుప్తపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రామాంజనేయరెడ్డి తెలిపారు.

మహిళ అదృశ్యం

డోన్ రూరల్ : మండల పరిధిలోని చిన్నమల్కాపురం గ్రామానికి చెందిన బోయ శకుంతల(48) అనే మహిళా అదృశ్యమైనట్లు రూరల్ పోలీసులు తెలిపారు. ఈనెల 5వతేదీన ఉదయం 9గంటలకు కూలీ పనులకు పోయి తిరిగి రాలేదు. బంధువులు, స్నేహితులను విచారించినా ఆచూకి తెలియలేదు. భర్త బోయ మద్దిలేటి ఫిర్యాదు మేరకు మహిళ అదృశ్యం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.



హెల్త్ క్యాంప్‌లో బీపీటెస్టులు చేయించుకుంటున్న శ్రీరాములు, రేగటి రాజశేఖర్‌రెడ్డి



ఆర్.లింగందిన్నె గ్రామంలో మహిళలకు మందులు, పంపిణీ చేస్తున్న దృశ్యం



ఓపీ వద్ద పేర్లు నమోదు చేసుకుంటున్న వైద్య సిబ్బంది



రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న మెడికల్ ఆఫీసర్ సోహెల్‌బాబు

ప్రజారోగ్య సంరక్షణే ప్రభుత్వ లక్ష్యం

- వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు
- ప్రతిపల్లెలో మెరుగైన వైద్య సేవలు
- రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి



రామాపురంలో రోగులకు మందులను పంపిణీ చేస్తున్న ఆరోగ్య సిబ్బంది



మహిళకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



బేతంచెర్ల హెచ్ కొట్టాల గ్రామంలో మందులు పంపిణీ చేస్తున్న ఎంపీపీ

డోన్ రూరల్ : ప్రజారోగ్య సంరక్షణే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ధ్యేయమని, ఆ దిశగా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారని రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. ఆరోగ్యశ్రీ పరిధిని పెంచడంతోపాటు ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్టై తీసుకొచ్చి మారుమూల గ్రామాల ప్రజలకు సైతం మెరుగైన వైద్యం అందజేస్తున్నారని గుర్తు చేశారు. మండల పరిధిలోని ఉడుములపాడు గ్రామంలో గురువారం ఎంపీడీఓ శ్రీనివాసులు ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంప్ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ అఖిల్, సాగరిక ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. హెల్త్ క్యాంప్‌లో 320మందికి ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. హెల్త్ క్యాంప్‌ను సందర్శించిన మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. అదేవిధంగా వారుకూడా బీపీ, షుగర్ పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ అన్ని వ్యాధులకు పరీక్షలు చేయడంతోపాటు మందులు అందజేస్తారన్నారు. ప్రజల ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం రూ. కోట్లు ఖర్చు చేస్తుందని, ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రామచంద్రుడు, వైద్య సిబ్బంది చెన్నయ్య, ప్రభాకర్, హనుమంత్, రాజేష్, ఎంపీటీసీ సుమిత్ర, గ్రామ నాయకులు నడిపెన్న, శ్రీనివాసరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, ప్రసాద్‌రెడ్డి, వీరాంజినేయులు, నాగమద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

602 మందికి వైద్య పరీక్షలు

అవుకు: మండల పరిధిలోని రామాపురం–1 గ్రామ సచివాలయ పరిధిలో గురువారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంప్‌లో డాక్టర్లు యమునా, జయేంద్రరెడ్డి, గైనకాలజిస్ట్ ప్రశాంతి, డెర్మటాలజీ జనార్ధన్ 602 మందికి వైద్య పరీక్షలు చేశారు. ఉదయం 7గంటలకు ఎంపీడీఓ వెంకటేశ్వరరెడ్డి, తహసీల్దార్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ప్రారంభమైన మెడికల్ క్యాంప్‌కు ప్రజల నుంచి విశేష స్పందన వచ్చింది. బీపీ, షుగర్, గుండె తదితర పరీక్షలను వైద్యులు చేసి, కావాల్సిన మందులను రోగులకు పంపిణీ చేశారు. అలాగే 127 మందికి కంటి పరీక్షలను నిర్వహించారు. అదేవిధంగా సర్జరీలు అవసరమైన 22 మంది రోగులను ఆరోగ్య శ్రీకి రెఫర్ చేసారు.

సంజామల: మండల పరిధిలోని ఆర్.లింగందిన్నె గ్రామంలో గురువారం ఎంపీడీఓ నాగకుమార్ ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంప్ నిర్వహించారు. సీనియర్ వైదులు వినోద్ కుమార్, ప్రియాంక, లోహితా, అనిషా 512 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 13 మందిని జిల్లా ఆసుపత్రికి సిఫారసు చేశారు. కార్యక్రమంలో ఆర్.లింగందిన్నె సర్పంచ్ అన్నెం దేవి, అక్కంపల్లె సర్పంచ్ గుర్కా వెంకట కృష్ణా రెడ్డి, సచివాలయ కన్వీనర్ అన్నెం శివరామిరెడ్డి, ఈఓఆర్డీ. పాపారాయుడు తదితరులు పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల: గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు సైతం కార్పొరేట్ వైద్యాన్ని అందించే లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తోందని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు పేరం సత్యనారాయణ రెడ్డి, మండల అధ్యక్షుడు అంబటి గుర్విరెడ్డి అన్నారు. గురువారం బందార్లపల్లెలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని వారు పరిశీలించారు. 20 మంది వృద్దులకు కంటి అద్దాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ యాతం స్వర్ణలత, ఎంపీడీఓ ప్రసాద్‌రెడ్డి, మెడికల్ ఆఫీసర్ రాజ్‌కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు యాతం శివరామిరెడ్డి, పేరం సూర్యనారాయణరెడ్డి, నందకిషోర్‌రెడ్డి, రామచంద్రుడు, వెంకట్రాముడు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష వైద్య శిబిరానికి విశేషస్పందన

బనగానపల్లె : మండలంలోని రామతీర్థం గ్రామంలో ఎంపీడీఓ శివరామయ్య అధ్యక్షతన గురువారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరానికి విశేషస్పందన లభించింది. ఉదయం 9 గంటల నుంచే వైద్య శిబిరం వద్దకు ప్రజలు ఎక్కువ సంఖ్యలో చేరుకున్నారు. జనరల్ వైద్యులు సోహెల్ బాబు, ఫిరోజ్, కంటి వైద్య నిపుణులు మదస్సార్, చిన్నపిల్లల వైద్యులు మంగ్యానాయక్ ప్రజలకు వైద్య పరీక్షలు చేశారు. దాదాపు 550 మంది ప్రజలు వైద్య సేవలు పొందారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ ఈఓ సుబ్బరాయుడు, సర్పంచ్ సురేష్ నాయుడు, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు ఇమాం ఖాసీం, సుబ్బారావు,బషీర్ అహమ్మద్, మద్దిలేటి బాలస్వామి హరికృష్ణనాయుడు గోవిందరాజులు ప్రతాప్‌నాయుడు చిన్నదానమయ్యలు సచివాలయ ఉద్యోగులు వలంటీర్లు పాల్గొన్నారు.

ప్యాపిలి: పేద ప్రజల ఆరోగ్యానికి జగన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రభుత్వం భరోసా కల్పిస్తోందని గార్లదిన్నె సర్పంచ్ సీమ మనోహరమ్మ, కేడీసీసీ డైరెక్టర్ సీమ సుధాకర్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని మాధవరం గ్రామంలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్య శిబిరంలో దాదాపు 415 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఐదుగురిని డోన్, కర్నూలు ప్రభుత్వాసుపత్రులకు సిఫారసు చేశారు. శిబిరంలో వైద్యులు నుస్రత్ ఉ జహా, నితీశ్, ఇంతియాజ్ ఖాన్, గౌస్ అహ్మద్ పీర్, సహృదయ్ తదితరులు వైద్య సేవలు అందించారు.

బేతంచెర్ల: సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష పేదల ఆరోగ్యానికి రక్షణగా నిలిచిందని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, వైస్సార్‌సీపీ మండల నాయకులు బాబుల్ రెడ్డి, గూని నాగరాజు అన్నారు. మండల పరిధిలోని హెచ్ కొట్టాల గ్రామంలో గురువారం ఇన్‌చార్జ్ ఎంపీడీఓ దస్తగిరి బాబు, ఈఓ ఆర్డీ వెంకట రంగనాయక్, సర్పంచ్ వెంకటలక్ష్మమ్మ, ఎంపీటీసీ రత్నమ్మ ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంప్ నిర్వహించారు. వైద్య సేవలపై ఎంపీపీ ప్రజలతో మాట్లాడి తెలుసుకున్నారు. డాక్టర్లు ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరం మేరకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అదేవిధంగా వృద్దులకు కంటి అద్దాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ తిరుమలేశ్వర్‌రెడ్డి, నాయకులు వెంకటేశ్వర్లు, రవి, దివాకర్, చంద్రశేఖరయ్య, రామయ్య, ఎల్లయ్య, గురుమూర్తి,రమణ, ఎల్లా కృష్ణ, సుంకన్న, గోరుమానుకొండ సర్పంచ్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

చిన్న పిల్లల కిడ్నాప్ ముఠా కలకలం!

డోన్ టౌన్ : చిన్నపిల్లలను కిడ్నాప్ ముఠా తిరుగుతందనే ప్రచారం గురువారం రాత్రి పట్టణంలో కలకలం రేపింది. మాకం వీధికి చెందిన ఓ అమ్మాయి ఓ ప్రైవేట్ పాఠశాల నుంచి సాయంత్రం ఇంటికి వస్తుండగా రైల్వే రోడ్డులోని చింత చెట్ల వద్ద గుర్తు తెలియని వ్యక్తి మభ్యపెట్టినట్లు సమాచారం. అమ్మాయి కేకలు వేయడంతో అక్కడున్నవారు వెళ్లగా గుర్తు తెలియని వ్యక్తి పరారైనట్లు స్థానికులు తెలిపారు. ఇది ఇలా ఉండగా బుధవారం సైతం మాకం వీధిలోని ఒక బట్టల దుకాణానికి చెందిన యజమాని పిల్లలు బయట ఆడుకుంటుండగా గుర్తు తెలియని వ్యక్తులు మాయ మాటలు చెప్పి రైల్వే స్టేషన్ వరకు తీసుకెళ్లినట్లు సమాచారం. స్థానికుల సమాచారం మేరకు రైల్వే స్టేషన్‌లో పిల్లలను గుర్తించారు. గుర్తు తెలియని వ్యక్తులను బెదరింపులకు పాల్పడినట్లు తెలిసింది. చేసేదేమీ లేక పిల్లలను తెచ్చుకున్నట్లు సమాచారం. రెండు కిడ్నాప్ కేసులు మాకం వీధికి సంబంధించినవే కావడం చర్చానీయంశంగా మారింది. ఈ విషయం తమ దృష్టికి రాలేదని, అయినా విచారణ చేస్తామని పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

యవత స్వయం ఉపాధిపై దృష్టి సారించాలి



ఐటీఐ విద్యార్థులకు ఉత్తీర్ణత పత్రాలను అందిస్తున్న ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి

అవుకు: యవత స్వయం ఉపాధిపై దృష్టి సారించాలని, నలుగురికి ఉపాధి కల్పించేలా ముందుకు సాగాలని ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి సూచించారు. మండల కేంద్రం అవుకు ఐటీఐ కళాశాలలో 2022–23 సంవత్సరానికి సంబంధించి ఉత్తీర్ణులైన విద్యార్థులకు గురువారం ఎంపీడీఓ కార్యాలయ భవనంలో ప్రిన్సిపల్ నాగరాజుతో కలిసి ఎంపీపీ ధ్రువ పత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ వివిధ సమస్యలలో ఉన్నత విద్యనభ్యశించలేని విద్యార్థులకు ఐటీఐ కళాశాల ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. సివిల్, ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రీషియన్, మోటార్ వెహికల్, డీజిల్ మెకానిక్, ఫిట్టర్ తదితర ట్రేడ్‌లు అందుబాటులో ఉంటాయని, వీటిలో మంచి ఉత్తీర్ణత సాధిస్తే భవిష్యత్తు బాగుంటుందని సూచించారు. అవుకు ఐటీఐ కళాశాలలో చదివిన ఎంతోమంది విద్యార్థులు నేడు పెద్దపెద్ద కంపెనీలు, ఆర్టీసీ డిపోలు, సిమెంట్ ఫ్యాక్టరీలలో మంచి ఉద్యోగాలు చేస్తున్నారని గుర్తు చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ తెలుగు రామప్ప, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

జల్ జీవన్ పథకంతో ప్రతి ఇంటికి తాగునీటి సరఫరా



ఓహెచ్‌ఆర్ ట్యాంకు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న బండిబ్రహ్మానందరెడ్డి

బనగానపల్లె రూరల్ : సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జల్‌జీవన్ పథకం ద్వారా ప్రతి ఇంటికీ తాగునీటి సరఫరా చేసేందుకు చర్యలు తీసుకున్నారని వైఎస్సార్‌సీపీ నాయకులు, యాగంటిపల్లె గ్రామ వ్యవసాయసలహా మండలి చైర్మన్ బండిబ్రహ్మానందరెడ్డి తెలిపారు. గురువారం గ్రామంలో జల్ జీవన్ పథకంలో భాగంగా రూ.32లక్షలతో 40 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన ఓహెచ్‌ఆర్ ట్యాంకు నిర్మాణానికి ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సహకారంతో గ్రామంలో ఇప్పటికే సీసీ రోడ్లు, డ్రైనేజీలను అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పిస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సాయికృష్ణ, పంచాయతీ కార్యదర్శి స్వర్ణలత, సర్పంచ్ బండివరలక్ష్మీ, గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు కళాధర్‌రెడ్డి, యామపుల్లారెడ్డి, శివప్రసాదరెడ్డి, నాగసుబ్బారెడ్డి, ఈశ్వరయ్య తదితర గ్రామస్తులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా సాయం అందజేత



వైఎస్సార్ బీమా నగు అందజేస్తున్న దృశ్యం

బేతంచెర్ల: మండల పరిధిలోని ఎం, పేండేకల్లు గ్రామానికి చెందిన పుల్లగుమ్మి రామాంజనేయులు(38) అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ మేరకు గురువారం బాధిత కుటుంబానికి వైఎస్సార్‌బీమా తక్షణ పాయంగా గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు ముచ్చు పరమేష్, వెల్ఫేర్ అసిస్టెంట్ గంగాధర్‌రెడ్డి మృతుని భార్య లక్ష్మీదేవికి రూ.10 వేలు అందజేశారు.